TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో స్ఫూర్తి కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై స్ఫూర్తి కలిగించాలని అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ...? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 1 | సంచిక :125 | prajadivvs57@gmail. com | బుధవారం 4, మార్చి 2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 4 | వెల : 3/-



# ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయాలి

99 రోజుల కార్యాచరణలో అందరూ భాగస్వామ్యం కావాలి

- విద్యా వ్యవస్థలో మార్పులపై ప్రజలకు అవగాహన
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు
- గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి
- కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయంలో కలెక్టర్లతో సీఎం సమావేశమయ్యారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశర చేశారు. 99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి. విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లులు చెల్లించాలని సీఎం అన్నారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అధికారులు, కలెక్టర్లకు

మిగతా 2 లో

99 రోజుల కార్యాచరణలో అందరూ భాగస్వామ్యం కావాలి

ఈ 99 రోజులు కలెక్టర్లు జిల్లా వీడి రావద్దు





ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు

## పనిచేయండి

కలెక్టర్లకు మంత్రి పొంగులేటి హితవు

2



## రాజ్యసభకు బీజేపీ అధ్యక్షుడు

9మంది అభ్యర్థులను ప్రకటించిన పార్టీ





## హైకోర్టుకు బాంబు బెదిరింపు

వారంలో ఇది రెండోసారి

.. వివరాలు 2లో

## భగ్గుమంటున్న యుద్ధ జ్వాలలు



### హోర్ముజ్ మూసివేతతో చమురు సంక్షోభం!

- హోర్ముజ్ జలసంధి మూసివేసినట్లు ఇరాన్ ప్రకటన
- ఆ మార్గంలో వచ్చే నౌకలను పేల్చేస్తామని హెచ్చరిక
- ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగే అవకాశం?
- అమెరికాపై భారీగా పడుతున్న యుద్ధ భారం.. తొలిరోజునే రూ.7 వేల కోట్లు ఖర్చు
- ఏఐ సాంకేతికతతో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ అంతం
- బహ్రెయిన్‌లోని అమెరికా బేస్‌పై ఇరాన్ డ్రోన్ల దాడి
- యూఏ ఈ, బహ్రెయిన్‌లోని అమెజాన్ డేటా సెంటర్లపై విరుచుకుపడ్డ డ్రోన్లు



## తెలంగాణలో అప్పు చేయకుండా పూటగడవని స్థితి

- ఖజానా ఖాళీ పేరుతో హామీలకు ఎగనామం
- ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ



తెలంగాణ రాష్ట్రం అప్పులు చేయనిదే గడవని దుస్థితికి చేరుకుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన బహిరంగ లేఖలో ఆయన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎండగట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా.. ఖజానా ఖాళీ నెపం చెబుతూ ప్రభుత్వం తప్పించుకుంటోందని ఆరోపించారు.



## మూసీ ఒడ్డున భారీ అక్రమ నిర్మాణం

- నార్సింగ్‌లో నిర్మాణంలో ఉన్న వెంచర్ వద్ద ధర్నా
- కవిత ధర్నాను అడ్డుకున్న పోలీసులు
- హైడ్రాకు అక్రమాలు కనిపించడం లేదా అని ప్రశ్న

హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. నార్సింగిలోని ఓ వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ధర్నా చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకొని పోలీసు వాహనాల్లో తరలిస్తుండగా.. జాగృతి కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, జాగృతి కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది.

## రాజ్యసభ రేసులో నలుగురు బీసీ నేతలు

ఆ ఇద్దరు ఎవరో నేడు తెలుస్తుంది

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



## రాహుల్ ప్రధాని అయితే దేశానికి గ్రహణం

అయినా ప్రధాని పదవి ఖాళీ లేదు


బండి సంజయ్ ఘాటు విమర్శ





## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలి

పాల కల్తీకి ప్రభుత్వానిదే బాధ్యత: సీపీఐ జాతీయ కార్యదర్శి




# హైకోర్టుకు బాంబు బెదిరింపు

తెలంగాణ హైకోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు రావడంతో తీవ్ర కలకలం రేగింది. ప్రోటోకాల్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. వెంటనే అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కోర్టు పరిసరాలను ఖాళీ చేయించి తనిఖీలు ప్రారంభించారు. బాంబు స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు రంగంలోకి దిగి ప్రతి మూలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయి. వారం రోజుల వ్యవధిలో రెండోసారి బాంబు బెదిరింపు రావడం గమనార్హం. ఇటీవల కూడా ఇలాంటి ఈ-మెయిల్ రావడంతో భద్రతా చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణ కోర్టులను లక్ష్యంగా చేసుకుని తమిళనాడు పేరుతో ఈ-మెయిల్ పంపినట్లు సమాచారం. ఈ-మెయిల్ మూలాన్ని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం హైకోర్టు ప్రాంగణంలో భద్రతను మరింత పెంచి, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచారు.

# మూడు వారాల్లోగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నిక

## రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లోగా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంగళవారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో 19వ కార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోయాడు. దీంతో తన తండ్రిని ప్రత్యర్థి పార్టీ నేతలు కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పక్రియపై స్టే విధించింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మూడు వారాల్లోపు పూర్తి చేయాలని తుది తీర్పును వెలువరించింది .

# మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు

## ఘటనలో నలుగురు సిబ్బంది సస్పెన్షన్

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీనిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టడంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపింది. విచారణ అనంతరం బాధ్యులైన నలుగురిని వైద్యారోగ్య శాఖ కమిషనర్ సస్పెండ్ చేసింది. జడ్చర్ల మండలం నాగసాలకు చెందిన భీమేశ్ (32) ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందాడు. రెండు రోజుల తర్వాత మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు జడ్చర్ల ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. ఈ విషయం తెలిసి బంధువులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ క్రమంలో మార్చురీలో కుక్కల శబ్దం రావడంతో దగ్గరికి వెళ్లి చూసిన బంధువులకు ఓ కుక్క మృతదేహాన్ని పీక్కుతినడం కనిపించింది. కుటుంబీకులు ఈ ఘటనను వీడియో తీసి, సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఇంత ఘోరమైన పరిస్థితికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాలను భద్రపరచడానికి ఫ్రీజర్లు లేకపోవడం, సిబ్బంది పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగినట్టు తెలుసింది. దవాఖాన వైద్యులు, సిబ్బంది వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

# కుటుంబ కలహాలు

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య




కుటుంబ కలహాలు మరో ఇంటిని చిదిమేశాయి. ఇద్దరు పిల్లల్ని చంపి, ఓ తల్లి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్ యాదవ్, ఐశ్వర్య దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఐశ్వర్య తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. సోమవారం నాడు ఐశ్వర్య కుటుంబసభ్యులు ఆమెను తీసుకొచ్చి అత్తారింట్లో వదిలేసి వెళ్లారు. కానీ అదే రోజు రాత్రి ఇద్దరు చిన్నారులను మెత్తతో ఊపిరాడకుండా చేసి ఐశ్వర్య చంపేసింది. అనంతరం ఆమె కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# కేసీఆర్ హోలీ శుభాకాంక్షలు



రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల్లో హోలీ కొత్త ఆశలు, విశ్వాసాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరి నడుమ ప్రేమాభిమానాలను విరజిమ్మే రంగుల పండుగగా, హోలీ పండుగ భారతీయ సంప్రదాయంలో ప్రత్యేకతను సంతరించుకున్నది అని కేసీఆర్ అన్నారు. ఆకులు రాలే శిశిరం నుంచి కొత్త చిగురులు తొడిగే వసంతానికి బాటలు వేస్తూ, ప్రకృతిలో నూతనత్వానికి సూచకంగా హోలీ నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఆశలు అడుగంటి ఉన్న తెలంగాణ ప్రజల్లో, కొత్త ఆశలు విశ్వాసాలు తిరిగి పుంజుకోవాలని, ప్రజల నడుమ మరింతగా సహోదరతత్వం పెంపొందాలని హోలీ సందర్భంగా కేసీఆర్ ఆకాంక్షించారు.

# ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయాలి

మొదటి పేజీ తరువాయి



పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలు, పాలనాపరమైన సంస్కరణలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మరోవైపు పలువురు కలెక్టర్లపై సీఎం సీరియస్ అయ్యారు. కొంత మంది కలెక్టర్లు జిల్లా హెడ్ క్వార్టర్ లో ఉండటం లేదన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. అలాంటి వారు తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 99 రోజుల పాటు జిల్లా విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ఈ గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను పరుగులు పెట్టించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. 99రోజుల పాటు జిల్లాను విడిచి వెళ్లొద్దని సీఎం ఆదేశించారు. రాజధాని శివారు జిల్లాల కలెక్టర్లు.. సీఎస్ కె.రామకృష్ణారావు అనుమతి లేకుండా హైదరాబాద్ వస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వేగం పెంచే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పేరుతో 99 డేస్ యాక్షన్ ప్లాన్ అమలు చేయబోతోందన్నారు. జిల్లాల్లో బాగా పని చేసిన కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా మీటింగ్‌లో పనితీరు ఆధారంగా కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వనున్నారని ఆశించిన మేరకు పని తీరు చూపని కలెక్టర్లకు దిశానిర్దేశర చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను నిర్వహిస్తుంది. అయిదు దశల్లో 99 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తున్న ప్రణాళిక శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ ,ఏప్రిల్ 16న మండల స్థాయిలో , మే 2న నియోజకవర్గ స్థాయి , మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని ఆ శాఖ వెల్లడించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపింది. 10 వివిధ థీమ్‌లతో శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమం ఉంటుందని వివరించింది. మొదటి థీమ్‌లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ , రెండవ థీమ్‌లో ఆరోగ్యం 3లో అరైవ్.. అలైవ్, 4లో సంక్షేమం , 5లో పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6లో రైతు సంక్షేమం.. వ్యవసాయంపై కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. 7లో విద్య, 8లో యువత.. క్రీడలు, 9లో మహిళలు , 10వ థీమ్‌లో పర్యావరణంపై సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు , 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని వివరించింది. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశామని వెల్లడించింది .

# ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయండి

- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి హితవు



ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు జిల్లా కలెక్టర్లు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన పలు జిల్లాల కలెక్టర్లు మంగళవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాల పాలన, సంక్షేమ పథకాల అమలుపై మంత్రి వారికి కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. మంత్రిని కలిసిన వారిలో జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి. ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్లుగా పనిచేయడమే అత్యంత కీలకమైన అవకాశం. ఈ సమయంలో ప్రజలతో నేరుగా మమేకమైతే క్షేత్రస్థాయి సమస్యలపై పూర్తి అవగాహన వస్తుంది. ఈ అనుభవమే మీ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి గుర్తు చేశారు. ఈ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి చేర్చవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని ఆయన స్పష్టం చేశారు. సంక్షేమం , అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజాపాలనలో 'ప్రజలే కేంద్రంగా' పాలన సాగాలని మంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశర చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను అర్థం చేసుకుంటూనే, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి. అధికార యంత్రాంగం అంతా ఒక టీమ్‌లా కలిసి పనిచేసి, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని ఆయన చెప్పారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అన్ని అంశాలపై పట్టు సాధించాలని ఆయన అధికారులకు సూచించారు.

# వేసవి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ప్రణాళిక

- ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



మంగళవారం ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్‌ను తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను నమోదు చేసుకుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వేసవి కాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగం గరిష్ఠంగా ఉంటుందని.. అందుకు తగిన అవసరాల కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. కోతలు లేకుండా.. ఎటువంటి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. పెద్ద రాష్ట్రాలతో సమానంగా తెలంగాణ రికార్డు సృష్టించిందని వివరించారు. ఉదయం 8.00 గంటలకే నింగిలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో ఇళ్లలోనే ప్రజలు ఉండి పోతున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు ఆన్ చేసి.. ఉంచుతున్నారు. దాంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది.

# నేడు జైలు నుంచి బాల్క సుమన్ విడుదల

## ర్యాలీ కోసం బీఆర్ఎస్ నేతల సన్నాహాలు



: క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా కేసులతో జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ , బీఆర్ఎస్ నాయకులు బుధవారం విడుదల కానున్నారు. బెయిల్ పిటిషన్ పై సోమవారం వాదనలు విన్న జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే చెన్నూర్ కోర్టులో ఉన్న మరో కేసులో పీటీ వారెంట్ ఫిటిషన్‌పై విచారణను ఆ కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. బాల్కసుమన్‌కు ఈ కేసులోనూ బెయిల్ రావాల్సి ఉండటంతో ఐదో తేదీ తర్వాతే ఆయన జైలు నుంచి బయటికి వస్తారని అంతా భావించారు. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నూర్ కోర్టులో పీటీ వారెంట్ ఫిటిషన్ పై విచారణ జరపాలని బాల్కసుమన్ అడ్వొకేట్లు మరో ఫిటిషన్ వేయడంతో కోర్టు విచారణను స్వీకరించింది. బాల్కసుమన్ తరుపు న్యాయవాదులు వాదనల అనంతరం పెట్టిన కేసు బెయిలెబుల్ అఫెన్స్ కావడంతో బెయిల్ మంజూరు చేసింది. దీంతో బాల్కసుమన్ సహా ఆయనతో పాటు అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు జైలు నుంచి విడుదల కానున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేశామని, రేపు ఉదయం 7 గంటలకు బాల్కసుమన్ జైలు నుంచి బయటికి వస్తారని ఆయన తరుపు న్యాయవాదులు తెలిపారు. బాల్కసుమన్ బయటికి రానున్న నేపథ్యంలో చెన్నూర్ లో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. జైలు నుంచి బయటికి వచ్చిన బాల్కసుమన్ సహా ఇతర బీఆర్ఎస్ నాయకులను వందలాది వాహనాల్లో ర్యాలీగా క్యాతన్‌పల్లికి తీసుకురానున్నారు. వచ్చే మార్గంలో మంచిర్యాల జిల్లా పరిధిలోని ప్రధాన రహదారి మార్గాల్లోని పలు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తూ, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి సుమన్ పూలమాల వేస్తారని అక్కడి నుంచి నేరుగా క్యాతన్‌పల్లిలోని తన నివాసానికి చేరుకుంటారని బీ ఆర్ఎస్ నాయకులు తెలిపారు.

# ప్రాణం తీసిన స్పోర్ట్స్ బైక్ రైడ్ సరదా

## స్నేహితుడితో కలసి రైడ్ చేస్తుండగా ప్రమాదం

స్పోర్ట్స్ బైక్‌పై మోజు ఓ ఇంటర్ విద్యార్థి ప్రాణాలు తీసింది. నాగోల్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు స్నేహితుల సరదా బైక్ రైడ్ విషాదంగా ముగిసింది. స్పోర్ట్స్ బైక్‌పై వేగంగా వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. మృతుడు విష్ణువర్ధన్, గాయపడిన విద్యార్థి ఉషాకిరణ్ (16)గా గుర్తించారు. విద్యార్థులిద్దరూ కొత్తపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. సోమవారం మ్యాథ్స్ పరీక్ష రాసిన అనంతరం ఎన్జీవోస్ కాలనీ నుంచి కేటీఎం స్పోర్ట్స్ బైక్ ను అ÷-దదెకు తీసుకున్న ఉషాకిరణ్ (16).. దానిపై రైడింగ్ చేయగా, విష్ణువర్ధన్ వెనక కూర్చున్నట్లు తెలుస్తోంది. ఫొటో సెషన్ కోసం శివారులో రైడ్ చేస్తూ అతివేగంతో వెళ్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. విష్ణువర్ధన్ తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉషాకిరణ్‌కు కాలు, చేయి విరిగినట్లు తెలుస్తోంది. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫత్తుల్లాగూడ 100 ఫీట్ రోడ్డులో ఈ దుర్ఘటన జరిగింది. ఇదే సమయంలో వారి మరో స్నేహితుడు మణిదీప్ ఫోన్ చేయడంతో ప్రమాద విషయం వెలుగులోకి వచ్చింది. నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విష్ణువర్ధన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన ఉషాకిరణ్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.



# వేములవాడలో కుక్కల స్వైర విహారం

**-- 25 మందికి గాయాలు**

**- బాధితులకు అండగా వార్డు కౌన్సిలర్ ఇప్పప్పుల మమత అజయ్**

**వేములవాడ/మార్చి 03 ప్రజా దివాస్** వేములవాడ పట్టణంలో కుక్కల స్వైర విహారం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు జరిగిన ఘటనల్లో సుమారు 25 మందికి పైగా వ్యక్తులపై వీధి కుక్కలు దాడి చేసినట్లు సమాచారం .ప్రధానంగా 22వ వార్డు మరియు పట్టణంలో ఉన్న బద్ది పోచమ్మ వీధి, అర్బన్ కాలనీ, సుభాష్ నగర్ ఏరియా, ధోబి ఘాట్, మార్కెట్ ఏరియా లలో ఈ దాడులు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. స్థానికుల ప్రకారం, ఒక్కసారిగా వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు పాదచారులు, చిన్నారులపై దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు.ఈ విషయం తెలిసిన వెంటనే 22వ వార్డు కౌన్సిలర్ ఇప్పప్పుల మమత అజయ్ తక్షణమే స్పందించారు. గాయపడిన వారిని వెంటనే తానే స్వయంగా ఆటోలో ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. బాధితులను పరామర్శించి, అవసరమైన వైద్యసహాయం అందేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేశారు.అలాగే ఈ ఘటనపై ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సమాచారం అందించినట్లు కౌన్సిలర్ తెలిపారు. సమస్య తీవ్రతను గుర్తించిన మున్సిపల్ కమిషనర్ స్పందించి, ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. పలు వార్డుల్లో కుక్కలను పట్టుకునే చర్యలు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కుక్కల నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, పట్టణ ప్రజలు పిల్లలను బయటకు పంపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పదంగా తిరిగే కుక్కలను వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు.



# వేములవాడలో వీధి కుక్కల దాడి: బాధితులను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ/మార్చి 03 ప్రజా దివాస్** వేములవాడ పట్టణంలో గత రెండు రోజులుగా వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. పట్టణంలోని 22వ వార్డు, బద్ది పోచమ్మ వీధి, అర్బన్ కాలనీ, సుభాష్ నగర్, ధోబీఘాట్ మరియు మార్కెట్ ప్రాంతాల్లో కుక్కలు జరిపిన దాడుల్లో సుమారు 25 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తక్షణమే స్పందించారు.ఆయన ఏరియా ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న బాధితు లను పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించి, వారికి మెరుగైన చికిత్స అందించాలని మరియు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణంలో కుక్కల బెడదను నివారించేందుకు మున్సిపల్ యంత్రాంగం ఇప్పటికే ప్రత్యేక బృందాలను రంగంలోకి దించిందని, కుక్కలను పట్టుకునే ప్రక్రియ వేగవంతం చేశామని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని ఆయన భరోసా ఇచ్చారు. చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



# హోలీ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్





**రాజన్న సిరిసిల్ల/// వేములవాడ / మార్చి 03 ప్రజా దివాస్** రంగుల పండుగగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే హోలీ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.. మంగళవారం వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ హోలీ పండుగ సాంప్రదాయాలు మన సంస్కృతిలో ఐక్యత, సౌభ్రాతృత్వం, ఆనందాన్ని ప్రతిబింబిస్తాయని ఆయన పేర్కొన్నారు.హోలీ అనేది చెడుపై మేలుకు గెలుపును సూచించే పర్వదినమని, ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, సుఖశాంతులు నింపాని విప్ఆకాంక్షించారు. రంగులతో ఒకరినొకరు ఆహ్వానించుకుంటూ స్నేహభావాన్ని పంచుకునే ఈ వేడుక సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు..హోలీ కంటే ఒక రోజు ముందు మన ప్రాంతంలో కామ దహనం పురాణాల ప్రకారం హోలీక అనే రాక్షసి మరణించడం వలన పలు ప్రాంతంలో హోలీకా దహనమని మన ప్రాంతంలో కామ దహనం ను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు..ప్రజలు సురక్షితంగా, పర్యావరణహితంగా హోలీ వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

# రాష్ట్ర ప్రభుత్వ విప్ ను కలిసిన వేములవాడ సబ్ డివిజన్ డీఎస్పీ

**రాజన్న సిరిసిల్ల జిల్లా/// వేములవాడ/మార్చి 03 ప్రజాదివాస్**

ఇటీవల వేములవాడ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బదిలీపై వచ్చిన శ్రీనివాసులు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు..



# వేములవాడ సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు

**శాంతిభద్రతల పరిరక్షణే నా ప్రథమ లక్ష్యం: నూతన డీఎస్పీ శ్రీనివాసులు**




**రాజన్న సిరిసిల్ల వేములవాడ/ మార్చి 03 ప్రజా దివాస్** వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో నూతన డీఎస్పీగా శ్రీనివాసులు మంగళవారం బాధ్య తలు స్వీకరించారు. ఉదయం కార్యాలయానికి చేరుకున్న ఆయ నకు పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తానని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబా టులో ఉంటానని, పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వేములవాడలో శివకళ్యాణోత్సవాల ఏర్పాట్లపై ఈవో సమీక్ష సమావేశం



**రాజన్న సిరిసిల్ల ,వేములవాడ /మార్చి 03 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో జరగబోయే స్వామివారి శివకళ్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమాదేవి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఆలయ అర్చకులు, ఉద్యోగులు మరియు సంబంధిత విభాగాల సిబ్బందితో కలిసి ఈరోజు తన చాంబర్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సమయంలో ఆల యానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఈవో ఆదేశి చారు. శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో దర్శన ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయం, తాగునీరు, పారిశుధ్య పనులు,విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శివకళ్యాణోత్సవాలు భ క్తుల ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంపొందించేలా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఈవో రమాదేవి గారు స్పష్టం చేశారు.

# బదిలీపై వెళ్తున్నకానిస్టేబుళ్లను సన్మానించిన ఎస్సై గణేష్



**ముస్తాబాద్/ మార్చ్ 3 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా కానిస్టేబుల్ గా విధులు నిర్వహించి ఇతర ప్రాంతాలకు బదిలీపై కుమారు రైటర్ ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ కు బదిలీ కావడం జరిగింది ఈ సందర్భంగా ముస్తాబాద్ ఎస్సై గణేష్ మండలంలో కష్టపడి ఉత్తమ సేవలందించి బదిలీపై వెళ్తున్న సందర్భంగా కానిస్టేబుల్ లను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మాట్లాడుతూ కానిస్టేబుల్ విధి నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ఉత్తమ సేవలందించి ఉద్యోగరీత్యా బదిలీ కావడం సహజమని వారన్నారు బదిలీ కానిస్టేబుల్స్ మాట్లాడుతూ ముస్తాబాద్ మండలంలోని ప్రజలు పలు రాజకీయ పార్టీల నాయకుల తోటి సిబ్బంది ఎస్సై సహకారంతో ఉత్తమ సేవలు అందించడం జరిగిందని ఎల్లప్పుడూ అందరూ మంచి మనసుతో ఆదరిస్తారని ఆశిస్తున్నాను ఈ కార్యక్రమంలో ఎస్సై గణేష్ భూమయ్య రాజశేఖర్ శ్రీనివాస్ మంజుల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# రైతు వేదికలకే పరిమితమైన వ్యవసాయ శాఖ అధికారులు

### క్షేత్రస్థాయిలో కనిపించని వ్యవసాయ అధికారులు



**కాల్వ శ్రీరాంపూర్ మార్చి 03 ప్రజా దివాస్** పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం లో ఆయా గ్రామాలకు వ్యవసాయ విస్తరణ అధికారులను ప్రభుత్వం నియమించినది. కానీ వారు గ్రామాలలోని మొక్కజొన్న, పత్తి, మిరప, కూరగాయ వరి వంటి పంటలను క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా పంటలు ఏ విధంగా పండిస్తున్నారు వాటికి సరైన సమయంలో మందులు ఏ విధంగా వాడుతున్నారో రైతుల వద్దకు వెళ్లి క్రిమి సంహారక మందులను గూర్చి రైతులకు వివరించేందుకే ప్రభుత్వం నియమించింది కానీ నేడు రైతుల పంటలను చూసేనాథుడే కరువైందని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత రైతులు క్రిమిసంహారక దుకాణాల వద్దకు వెళ్లి మా పొలం గిట్ల ఉన్నది మొక్కజొన్న పెరడు పలు రకాల కూరగాయలు ఈ విధంగా ఉన్నాయి ఏ మందులు వాడాలి అని వారిని సంప్రదించి మందులు వాడుతున్నారు. గత ప్రభుత్వం మండలాన్ని క్లస్టర్ గ్రామాలుగా విభజించి రైతువేదికలను నిర్మించిందని ప్రతిరోజు వారి పనులు రిత్యా వస్తు పోతున్నారు గాని అధికారులు మాత్రం రైతులకు తగు సూచనలు సలహాలు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇవ్వాలని పలు రైతులు కోరుకుంటున్నారు.

## అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మార్చి 3 భద్రాద్రి కొత్తగూడెం ప్రజా దివాస్** తోగ్గూడెం గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రజలకు సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఓలాద్రి రాజిరెడ్డి, ఉప సర్పంచ్ అచ్చ నవీన్, వార్డు సభ్యులు చిర్ర ఉప్పలయ్య, తాటి జానీబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్టీమల్ల సతీష్ చారి, కోరం నాగేష్, సల్లూరి లక్ష్మయ్య, సల్లూరి సృజన్, వడ్డే వినోద్, కొంపెల్లి మల్లేష్, బుడగం సందీప్ రెడ్డి, అక్కిరెడ్డి మల్లారెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు పుప్పాల నరసింహారావు, పుప్పాల సమ్మయ్య, ఇందుకూరి సీతారామరాజు, ఆలయ పూజారి ఇందుకూరి ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగరంలో నేడే హోలీ సంబరాలు




**ఖమ్మం ప్రతినిధి మార్చి 3 ప్రజా దివాస్** ఖమ్మం హెవిలియన్ గ్రౌండ్ నందు గురువారం యాంకర్ సబిత ఆధ్వర్యంలో ఖమ్మం హోలీ మీటింగ్ పెద్ద ఎత్తున జరగబోతుందని ఈ హోలీ సంబరాలకు ఖమ్మం నగరంలో ప్రజలందరూ రావాలని ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఖమ్మం రంగు స్టావ్ హోలీ మేళ పోస్టర్ ఆవిష్కరణ చట్టం జరిగింది. ఈ సందర్భంగా యాంకర్ సబితా మాట్లాడుతూ ఈ హోలీ సంబరాలను యువతి యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అదేవిధంగా ఈ హోలీ సంబరాలకు జబర్దస్త్ నుండి ఆర్టిస్టులు కూడా పాల్గొంటారని ఈ సందర్భంగా వారు తెలియజేసినారు. ఈ హోలీ మేళ్లకు టికెట్లు కావలసిన వాళ్లు స్థానిక పెవిలిన్ గ్రౌండ్ నందు 9848494996 9948959572 అనే నెంబర్ కు గల వారి దగ్గర దొరుకుతాయని ఈ సందర్భంగా వారు తెలియజేసినారు. ఆసక్తి వారు ఎవరైనా ఉంటే నేరుగా పేవిలియన్ దగ్గరకు వచ్చిపాస్ లు తీసుకోగలరని ఈ సందర్భంగా వాళ్లు తెలియజేసినారు. ఈ హోలీ మేళకి ప్రొడక్షన్ పార్ట్నర్ బై టీ ఆర్ ఆర్ ఆర్థో అండ్ యాక్సిడెంట్ కేర్ హస్పటల్ ఖమ్మం, మెర్సీ ఆడియో, నాగోల్ డెకరేషన్ అండ్ ఈవెంట్స్, తంబి డెకరేషన్ అండ్ ఈవెంట్స్ ఖమ్మం, మరియు చందు ఫోటో వీడియోస్, ఈ కార్యక్రమానికి స్పాన్సర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల పోలీస్ కార్యాలయంలో హోలీ సంబరాలు

### - రంగులమయమైన హోలీ వేడుకలు
### - హోలీ వేడుకల్లో స్టెప్పులతో అదరగొట్టిన ఎస్పీ మహేష్ బి గీతే







**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 3 ప్రజా దివాస్** జిల్లా పోలీస్ కార్యాలయంలో హోలీ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అందరూ కలిసి రంగులు పూసుకుంటూ, బ్యాండ్ మేళాల మధ్య స్టెప్పులు వేస్తూ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నిరంతరం విధి నిర్వహణలో ఉంటూ ఒత్తిడితో గడిపే సిబ్బందికి ఈ వేడుకలు మంచి ఉపశమనాన్ని ఇచ్చాయి. కులమతాలకు అతీతంగా, సోదరభావంతో అందరూ ఈ రంగుల పండుగలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ.. సమాజంలో శాంతిభద్రతలను కాపాడే పోలీసుల జీవితాల్లో కూడా ఇలాంటి పండుగలు సంతోషాన్ని, ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. పరస్పరం రంగులు పూసుకుంటూ, మిఠాయిలు పంచుకుంటూ అధికారులు, సిబ్బంది ఆనందోత్సాహాల మధ్య హోలీ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హోలీ పర్వదినాన్ని పరిష్కరించుకొని నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న పురపాలక సంఘం అధ్యక్షురాలు శ్రీమతి జిందం కళ చక్రపాణి దంపతులు



**సిరిసిల్ల పట్టణంలో మార్చి 3 ప్రజా దివాస్** ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి జిందం కళ చక్రపాణి గారు మాట్లాడుతూ..హోలీ పండుగ అనేది కేవలం రంగుల పండగ మాత్రమే కాదు ఇది మనుషుల మధ్య మానవత్వాన్ని ప్రేమ అనురాగాన్ని ఆప్యాయతలు ఐకమత్యాన్ని పెంపొందించే సాంస్కృతిక వేడుక అని అన్నారు. చెడు లక్షణాలను వదిలించుకొని మంచి లక్షణాలతో ఆదర్శప్రాయమైన జీవితాన్ని ప్రతి ఒక్కరు గడపాలని కోరుకుంటున్నాను అని ఈ సందర్భంగా అన్నారు..ఈ హోలీ పండుగ సందర్భంగా ప్రజా ప్రతినిధులకు పుర ప్రముఖులకు సిరిసిల్ల ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో బంధుమిత్రులతో సంతోషంగా పర్యావరణానికి అనుకూలమైన రంగులను వాడుతూ ఈ హోలీ పండుగ సంతోషంగా నిర్వహించుకోవాలని కోరుతున్నాను అన్నారు..ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి గారు మాట్లాడుతూ.సిరిసిల్ల పుర ప్రముఖులకు నాయకులకు పట్టణ ప్రజలకు టిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు..




# మండుతున్న ఎండలు

### -జాగ్రత్తలు పాటించాలంటున్న ఆరోగ్య నిపుణులు



**ఖమ్మం ప్రతినిధి మార్చి 3 ప్రజా దివాస్** వాతావరణము కాస్త చల్లగానే ఉంటుంది. కానీ బయట చూస్తే ఎం డలు మండిపోతు న్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు ఉక్కి రిబిక్కిరి చేస్తున్నా యి. మధ్యాహ్నం వేళల్లో భగభగ మండుతున్న ఎండను చూసి ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముందు ముందు ఇంకెలాంటి పరిస్థితి ఉంటుందో అని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం ప్రారంభం దశలోనే.. ఎండ లు మండిపోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే.. ఏప్రిల్.. మే నెల ఎలా ఉంటా యో అని ప్రజలు భయపడిపోతు న్నారు. ఎండ వేడిమి నుం డి ఆరోగ్యాన్ని కాపాడుకోవ డానికి ఆరోగ్య నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.

**ఎండ దెబ్బ నుండి రక్షణ.. వేసవి జాగ్రత్తలు..**

వేసవికాలం రాగానే భానుడు భగభగలు మొదలయ్యాయి. పెరిగే ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బ.. డీహైడ్రేషన్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఈ చిట్కాలను పాటిస్తే ఎండాకాలంలో కూడా ఆరోగ్యంగా ఉండవచ్చు.

**-నీరు ఎక్కువగా తాగండి..**

వేసవిలో శరీరంలో నీరు చెమట రూపంలో బయటకు పోతుంది. అందుకేదాహం వేయక పోయినా తరచుగా నీరు తాగుతూ ఉండాలి. కొబ్బరి నీళ్లు..మజ్జిగ..నిమ్మరసం వంటి సహజ పానీయాలు తీసుకోవ డం చాలా ఉత్తమం.కె ఫిన్ ఎక్కువగా ఉంటే కాఫీ..టీల ను తగ్గించడం మంచిది. పానీపూరి.. వేపుళ్లు.. హోటల్స్ ఫుడ్స్ తదితర బయట ఫుడ్ కు దూరంగా ఉండాలి.

**-పండ్లు.. కూరగాయలు..**

శరీరంలో నీటి శాతం పెంచే తాజా పండ్లను అధికంగా తీసుకోవాలి. నీటి శాతం ఎక్కువగా ఉండే ప చ్చకాయ..కర్బూజా.. కీరదోస..సొరకాయ వంటి వాటిని డైట్ లో చేర్చుకోండి. రోడ్డు పక్కన అమ్మే కట్ చేసిన పండ్లను తినక పోవడమే మంచిది.

**-ఎలాంటి దుస్తులు వాడాలి..**

లేత రంగులో ఉండే పలచని కాటన్ దుస్తులు ధరించాలి. ఇవి చెమటను పీల్చుకుని శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.బిగుతుగా ఉండే దుస్తులు కంటే.. వదులుగా ఉండేవి ఎంచుకోండి.

## జిల్లాలో టాపర్‌గా నిలిచిన ఎస్ ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థి

**ఖమ్మం ప్రతినిధి మార్చి 03 ప్రజా దివాస్** ఖమ్మం జిల్లా విద్యా రంగంలో మరో మైలురాయి నమోదైంది. ఖమ్మం నగరానికి చెందిన గోపాలపు రం లో గల ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాలలో లో చదువుతున్న 6వ తరగతి విద్యార్థి కూసుమంచి మండలం దేవునితండా కి చెందిన పాల్తీయ ప్రదీప్ చౌహాన్ జిల్లాలో టాపర్‌గా ఎన్నికై ప్రతిభ చాటాడు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ఈ గౌరవాన్ని దక్కించుకున్నాడు.విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదువుతూ గురువుల మార్గదర్శకత్వంలో విజయం సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రా ంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించి విద్యార్థిని సన్మానించారు.జోనల్ ఇన్చార్జ్ విజయ బాస్కర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కాంతారావు వారు మాట్లాడుతూ"మా విద్యార్థి సాధించిన ఈ విజయం ఇతరులకు స్ఫూర్తిదాయకం. పాఠశాలలో నాణ్యమైన బోధన, క్రమబద్ధమైన ప్రణాళికలే ఈ ఫలితానికి కారణం" అని పేర్కొన్నారు.విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ కుమారుడు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాం క్షించారు. జిల్లాలో టాపర్‌గా నిలిచిన ఈ విద్యార్థికి ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు అభినందనలు తెలియజేశారు.ఈ విజయంతో ఎస్ ఆర్ ప్రైమ్ పాఠశాల ఖ్యాతి మరింత పెరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

